క్లుప్తంగా

పప్పుశనగ విత్తన పంపిణీపై ఇంత నిర్లక్ష్యమా?

- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ యోగేందర్ రెడ్డి

ఉరవకొండ రూరల్: రబీ సీజన్‌లో రైతులకు పప్పుశనగ పంపిణీ చేయడంలో ఇంత నిర్లక్ష్యమా అంటూ నెరిమెట్ల సర్పంచ్ యోగేందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు అధికారులపై ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. జిల్లాలో అత్యధికంగా పప్పుశనగ ఉరవకొండ నియోజకవర్గంలో సాగవుతుందని తెలిసినా ఎందుకు విత్తన పంపిణీ చేయలేదని ఎంపీపీ నరసింహులు, నెరిమెట్ల సర్పంచ్ యోగేందర్‌రెడ్డి నిలదీశారు. రైతన్నకు సరిపడా ఎరువులను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విత్తనాలు, ఎరువుల పంపిణీలో చొరవ చూపాలని కోరారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు

కూడేరు: ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల శిక్షణను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో రాణించేందుకు శిక్షణా తరగతులు ఎంతో దోహదపడుతాయన్నారు. రాష్ట్ర అధికారులు ప్రతి సబ్జెక్టుకు ఒక మోడల్ లెసన్‌ను రూపొందించారని, వాటిని తరగతి గదిలో అనుసరించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహమ్మద్ గౌస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

ఉరవకొండ: పట్టణంలోని వీరశైవ కళ్యాణమంటపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, పీఏసీ సభ్యులు వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాడిపత్రి రమేష్‌రెడ్డి, రాష్ట్ర నేత వజ్ర భాస్కర్‌రెడ్డి హాజరుకానున్నారు. సమావేశంలో పార్టీ నిర్మాణం, అనుబంధ కమిటీల పనితీరు, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ తదితర అంశాలపై చర్చించనున్నారు. పార్టీ శ్రేణులు తప్పకుండా హాజరుకావాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు.


సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్

కళ్యాణదుర్గం: పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్ సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో శనివారం జీఎస్టీ 2.0 పై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం పేదలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం 1 కిలో వాట్‌కు సబ్సిడీ రూ.30 వేలు, 2 కిలో వాట్‌లకు రూ.60 వేలు, 3 కిలో వాట్‌లకు రూ.78 వేలు సబ్సిడీ కేటాయించిందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈలు జయకృష్ణ, గంగాధర్, భరత్‌లతో పాటు ఆస్కార్ ఎనర్జీ సిస్టమ్స్ వెండర్ తిప్పేస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



చౌకూరులో జ్యోతులు ఊరేగిస్తున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని చౌకూరు గ్రామంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలోని వాల్మీకి విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు జ్యోతులు ఊరేగింపుగా తీసుకెళ్లి, వాల్మీకి మహర్షికి సమర్పించారు. అనంతరం గ్రామంలో అన్నధానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

నో లైసెన్స్...నో ఎన్‌ఓసీ...!

- ఇష్టానుసారంగా టపాసుల దుకాణాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వెలసిన టపాసుల దుకాణాలు

కళ్యాణదుర్గం: అంతా మా ఇష్టం....మమ్మల్ని ఎవరు అడిగేది...మాకు ఎమ్మెల్యే అండ ఉంది...ఎవరికి చెప్పించాలో వారికి చెప్పిస్తాం...అంటూ కళ్యాణదుర్గంలోని టపాసుల దుకాణాదారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి టపాసుల దుకాణం పెట్టేందుకు ఆర్డీఓ కార్యాలయం నుంచి అందిన టెంపరరీ ట్రేడ్ లైసెన్స్‌తో పాటు ఫైర్ అధికారి ఎన్‌ఓసీ తప్పనిసరి. అయితే ఈ సారి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవేవీ లేకుండానే ఎలాంటి నిబంధనలు పాటించకుండానే వ్యాపారస్తులు దుకాణాలు తెరవడం కొసమెరుపు.

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు

ఈ ఏడాది దీపావళి పండుగను పురస్కరించుకుని కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సుమారు 17 టపాసుల విక్రయ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొందరు వ్యాపారులు అత్యాశతో ఎలాంటి లైసెన్స్ లేకుండానే దుకాణాలను తెరుచుకున్నారు. మరికొందరైతే లైసెన్స్ కోసం ఎదురుచూశారు. ఒకరిని చూసి మరొకరు ఇలా శనివారం సాయంత్రం వరకూ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు సాగించారు. ఇదిలా ఉంటే దుకాణాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు తప్పనిసరిగా ఫైర్ అధికారి నుంచిడి ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాల్సి వుంది. ఇది తీసుకున్నాకే దుకాణం ఏర్పాటు చేయాలి. కానీ దుకాణదారులు ఇవేవీ నిబంధనలు పాటించలేదు.

పట్టించుకోని అధికారులు

టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు కనీసం నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు, ఫైర్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ నేతల అండతో నిబంధనలు ఉల్లంఘించి నిర్వాహకులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అగ్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌ఓసీ ఒక్కరూ తీసుకోలేదు



ఈ సారి టపాసుల విక్రయ కేంద్రాలకు ఒక్కరు కూడా ఫైర్ ఆఫీస్ నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేదు. మొత్తం 17 దుకాణాలు పెట్టారు. ఇందులో 8 మంది మాత్రమే ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎవ్వరూ రాలేదు. ఏదైనా ప్రమాదాలు జరిగితే పూర్తి బాధ్యత నిర్వాహకులదే. దీనిపై ఆర్డీఓకు నివేదిక ఇస్తున్నాం. – వసంతనాయక్, ఫైర్ ఆఫీసర్, కళ్యాణదుర్గం

విద్యార్థిని మృతిపై విచారణ చేయించాలి



ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం కేజీబీవీలో అస్వస్థకు గురై మృతి చెందిన విద్యార్థిని జి.చందన మృతిపై సమగ్ర విచారణ చేయించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఏఐఎస్‌ఎఫ్ బాలికల కన్వీనర్ మౌలిక, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మురళి, హర్షవర్ధన్, రజిని మాట్లాడారు. కేజీబీవీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. విద్యార్థిని మృతిపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలలో నివాసం లేని ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు విష్ణు, జశ్వంత్, నందకిశోర్,, పవన్, మనులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



నూతన కమిటీ సభ్యులతో కుందుర్పి నాయకులు

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి గ్రామ, తాలూకా కమిటీలు నాయకులు సమన్వయంతో కృషి చేయాలని మండల పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు ,తాలూకా మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, సర్పంచ్ రామూర్తి, ఎస్సీ సెల్ కన్వీనర్ అన్వేష్, సూచించారు. శనివారం కుందుర్పి పంచాయతీలో గ్రామ కమిటీల ఏర్పాటు, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంచాయతీ అధ్యక్షుడిగా బొమ్మాజిపల్లి మల్లి, జనరల్ సెక్రటరీలుగా హనుమంతరాయుడు, శివానంద, బోయ మల్లికార్జున, సురేష్, సెక్రటరీలుగా ఆనందముని, గంగన్న, తిప్పేస్వామి, ఫల్గుణ, ఈరన్న, రవి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, వార్డు సభ్యుడు మంజు, గార్మెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి జాబ్ కార్డు రద్దు



ఎర్రగుంటలో విచారణ జరుపుతున్న ఏపీడీ రమేష్ నాయక్

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంటలో ఓ బడా టీడీపీ నాయకుడి జాబ్‌కార్డు రద్దు చేశామని ఏపీడీ రమేష్ నాయక్ తెలిపారు. అతడు రెండు జాబ్ కార్డుల చేయించుకుని, ఉపాధి నిధులను దుర్వినియోగం చేశారని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు కాపు మంజునాథ్ గత సోమవారం జిల్లా కేంద్రంలో డ్వామా పీడీకి ఫిర్యాదు చేయడం తెలిసిందే. కాగా శనివారం జిల్లా డ్వామా అసిస్టెంట్ పీడీ రమేష్ నాయక్ ఎర్రగుంటలో విచారణ చేపట్టగా టీడీపీ నాయకుడు ఆనంద్, ఆయన భార్య అనుకు రెండు జాబ్‌కార్డులు సృష్టించి హార్టికల్చర్ ప్లాంటేషన్ మంజూరు చేయించుకుని నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. అతడి భార్య జాబ్ కార్డును రద్దు చేస్తూ హార్టికల్చర్ పెంపకం నిలుపుదల చేశామన్నారు.కాగా ఆనంద్ 20431 నంబర్‌తో 2007లో జాబ్‌కార్డు చేసుకోగా భార్య అను పేరిట 30407 నంబరు జాబ్‌కార్డుతో 2024లో జాబ్‌కార్డు చేసుకున్నట్లు అధికారులు తేల్చారు. ఉపాధి బిల్లుల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని స్థానిక ఉపాధి హామీ సిబ్బందిని ఏపీడీ హెచ్చరించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు ఆనంద్ భార్య అను జాబ్‌కార్డు తొలగించిన విషయం, పండ్ల తోటల పెంపకం రద్దు విషయాన్ని లిఖిత పూర్వకంగా ఏపీడీ రమేష్ నాయక్ అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కాపు మంజునాథ్ తెలిపారు.

తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం



కూడేరు: తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

కూడేరు: కూడేరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ దృష్టికి పలువురు భూసమస్యలపై అర్జీలిచ్చుకున్నారు. కడదరకుంటకు చెందిన వెంకటేష్ రస్తా సమస్య పరిష్కారం కాలేదని చెప్పడంతో తహసీల్దార్ మహబూబ్ బాషా ప్రొసీడింగ్ ఇచ్చామని, పోలీసులు రస్తా విడిపించాల్సి ఉంది సార్ అని చెప్పబోగా కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఏంటి మీరు చేయాల్సింది పోలీసులపై చెబుతారా? రెండు రోజుల్లో మీరు, పోలీసులు సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూసమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పి.నాగిరెడ్డిపల్లిలో కబ్జాకు గురైన శ్మశాన స్థలాన్ని కాపాడాలని ఇప్పేరు సర్పంచ్ ఓబులేసు వినతిపత్రాన్ని అందజేశారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

బెళుగుప్ప: అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లో సీసీరోడ్లు, తాగునీరు, వీధిలైట్లతో పాటు సబ్సిడీ విత్తన పప్పుశనగ, ఈ –క్రాప్ బుకింగ్ తదితర సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సభ్యులు కోరారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, వైస్ ఎంపీపీలు పుష్పావతి, రేఖమ్మ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే



విద్యార్థుల నృత్య ప్రదర్శన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేతో పాటు పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ నాగరాజు హాజరయ్యారు. తొలుత జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన శ్రద్ధ, ఇతరాత్ర విషయాలను వివరించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన, డాన్స్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ ఊరేగింపు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి పల్లకీ సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ మేలతాళాలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏసీ తిరుమల్ రెడ్డి, ఆలయ అర్చకులు ద్వారకానాథ స్వామి, బాలాజీ స్వామి, సిబ్బంది మారుతీ పాల్గొన్నారు.

కేజీబీవీలకు నిధులు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీ పాఠశాలలకు నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, కేజీబీవీల్లో స్థానికంగా లేని ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లాలోని కేజీబీవీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. హనుమంతరాయుడు మాట్లాడుతూ కేజీబీవీల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు చేయాలని, ప్రహరీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్రహ్మసముద్రం కేజీబీవీ పాఠశాలలో మరణించిన విద్యార్థిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ శ్యామ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉరవకొండలో...

ఉరవకొండ: జిల్లాలో ఉన్న కస్తూర్బా పాఠశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కరుణాకర్ మాట్లాడుతూ కేజీబీవీల్లో నాడు– నేడు పనులు 80 శాతం పూర్తి కాగా మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయా పాఠశాలలోల బోధనేతర సిబ్బందిని నియమించాలని, స్థానికంగా లేని ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలన్నారు. నాయకులు లాలుస్వామి, సిద్దిక్, మన్సూర్ వలి, రాజు, షాదిక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు తలారి రంగయ్య రాక

కుందుర్పి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిజవళ్లిలో ఆదివారం నిర్వహించే రచ్చబండ కార్యక్రమానికి మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరుకానున్నట్లు సర్పంచ్ ప్రభాకర్, మండల కన్వీనర్ హనుమంతరాయుడు తదితరులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు సూచించారు.

డీటీఈఓ, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ మొదటి విడతలో భాగంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి కోరారు. ఈ నెల 21వ తేదీలోగా అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తును స్కిల్ హబ్ సెంటర్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 7801031771 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లాత్ బ్యాగులు, మొక్కల పంపిణీ

కూడేరు: జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కూడేరులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆనంద్ చేతులు మీదుగా ప్రజలకు బట్టతో తయారు చేసిన బ్యాగులు, మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వద్దు–ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో ప్రజలను చైతన పరిచేందుకే క్లాత్ బ్యాగులు ఇచ్చినట్లు జాగృతి ఫౌండేషన్ చైర్మన్ పురుషోత్తం తెలిపారు.

పదోన్నతి పొందిన తహసీల్దార్‌కు సన్మానం

రాయదుర్గంటౌన్: డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన రాయదుర్గం తహసీల్దార్ జి.నాగరాజును అధికారులు, కార్యాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు శనివారం అభినందించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఆర్‌ఐ రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ చంద్ర, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు ఆయన్ను సన్మానించారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: పోలీసు అమరువీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని అర్బన్ సీఐ కె.జయనాయక్, రూరల్ సీఐ కె.వెంకటరమణ కోరారు. యువత, దాతలు తరలివచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, కోనాపురం , గలగల, ఆర్.కొత్తపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు నీరు పారుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రజాక్‌వలికి అందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ రూరల్: ఉచిత పశుగర్భకోశ వ్యాధి నివారణ వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీడీ వెంకటేష్, ఉరవకొండ ఏడీ పెద్దన్న సూచించారు. శనివారం ఆమిద్యాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకను నిర్వహించారు. ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనుంజయ కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఋషివర్మ, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, సభ్యులు నారాయణస్వామి, అశోక్, శ్రీనివాసులు, మధు, ఈశ్వర్, రమేష్, శివానంద, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాదారులు నిబంధనలు అతిక్రమించినా, నిర్వహణలో పొరపాట్లు జరిగినా లైసెన్సు రద్దు చేస్తామని తహసీల్దార్ నాగరాజు, అర్బన్ సీఐ జయనాయక్ హెచ్చరించారు. శనివారం వారు టపాసుల దుకాణాలను తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. పట్టణంలో మొత్తం 20 దుకాణాల ఏర్పాటుకు అనుమతులు పొందగా 14 స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు.

వాయు కాలుష్యాన్ని తగ్గించాలి



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 1వ వార్డు పార్వతీనగర్‌లోని వార్డు సచివాలయం వద్ద క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొనగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

సాక్షిబృందం: స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని చోట్లా నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ... వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ర్యాలీలను నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

వేంకటరమణస్వామికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటరణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న జేబీపీ జిల్లా అధ్యక్షుడు రామప్పనాయక్

ఉరవకొండ: వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని జైభీమ్‌రావు భారత్ పార్టీ(జేబీపీ) జిల్లా అధ్యక్షుడు రామప్పనాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జేబీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. రామప్పనాయక్ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు అప్పగిస్తే పేదవిద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు కనుమరుగవుతాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రవైటీకరణ విధానానికి స్వస్తి పలకాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరి అశోక్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం అందకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తోందని ధ్వజమెత్తారు. జేబీపీ జిల్లా కన్వీనర్ వడ్డేర వీర, వైఎస్సార్‌సీపీ నాయకులు శుభ్యానాయక్, ప్రసాద్‌నాయక్, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదు


- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

బెళుగుప్ప: తమను టీడీపీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లొంగే ప్రసక్తే లేదని తమ పూర్తి మద్దతు వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి కురుబ వరలక్ష్మికే ఉంటుందని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరంగాపురం ఎంపీటీసీ కురుబ వరలక్ష్మి స్వగృహంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శివలింగప్ప, మండల కన్వీనర్ మచ్చన్న ఎంపీటీసీలు రేఖమ్మ, ప్రభావతి, నాగరత్నమ్మ, సురేష్, ప్రసాద్, వీరబొమ్మన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం అప్పట్లో ఎంపీపీ పెద్దన్నకు రెండున్నరేళ్లు, శ్రీరంగాపురం ఎంపీటీసీ కురుబ వరలక్ష్మి రెండున్నరేళ్లు ఎంపీపీ పదవి ఉండేలా నిర్ణయించారన్నారు. అయితే అధిష్టానం ఆదేశాలను ధిక్కరించిన ఎంపీపీ పెద్దన్న కొన్ని నెలల క్రితం టీడీపీలోకి ఫిరాయించారన్నారు. దీంతో తాము ఈనెల 3న ఆయనపై ఆర్‌డీఓ వసంతబాబుకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందించామన్నారు. అవిశ్వాసం సమయం దగ్గర పడుతున్న కొద్దీ టీడీపీ నాయకులు, ఎంపీపీ పెద్దన్న తమను ప్రలోభాలతోపాటు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అయినా తాము పార్టీ నిర్ణయించిన అభ్యర్థికే మద్దతు పలుకుతామని ప్రకటించారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, పాతన్న, పూల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రాణాపాయం



లారీ కింద పడిన ద్విచక్ర వాహనం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు ప్రాణాపాయం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. బళ్లారి వైపు నుంచి కణేకల్లుకు ద్విచక్ర వాహనంలో షాకిర్, ఆయాన్, అస్లామ్ వస్తున్నారు. వెనుక వైపు నుంచి వచ్చిన లారీ .. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్ లారీ చక్రాల కింద పడి దెబ్బతినింది. అయితే యువకులు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. వార్షిక రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రంథాలయ పన్ను బకాయిలు వెంటనే వసూలు చేయాలని గ్రంథాలయాధికారి ప్రసాద్‌కు సూచించారు.